1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్
సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

పీసీసీ పదవి బీసీ నాయకుడికే కేటాయించాలి

- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు పల్లి కృష్ణ యాదవ్
- సామాజిక న్యాయానికి తూట్లు
- ఆరు నెలలవుతున్న పాలనలో సామాజిక న్యాయాన్ని పాటించడం లేదు

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ అభ్యర్థికి కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు పల్లి కృష్ణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీ జపం చేసిన రేవంత్ రెడ్డి 0.5శాతం ఉన్న వెలమ సామాజిక వర్గానికి 9 సీట్లు, రెడ్డి సామాజిక వర్గానికి 49 సీట్లు కేటాయించి 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 23 సీట్లు కేటాయించి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచారని ఆయన మండిపడ్డారు. సామాజిక న్యాయం మా ఏడవ గ్యారెంటీ అని ప్రకటించి ఆరు నెలలవుతున్న పాలన లో సామాజిక న్యాయాన్ని పాటించడం లేదన్నారు.త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో, బీసీలకు నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేనియెడల ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ- మహమ్మదాబాద్

మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామానికి చెందిన తిరుమలయ్య ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్నా తోటి స్నేహితులు 1994-95 10వ తరగతి బ్యాచ్ కి చెందిన తోటి స్నేహి తులు మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పరశురాం, మొగులయ్య, డిరాములు, రాంబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రాములు



నవతెలంగాణ హన్వాడ

పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రాములు అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు మండల కార్యదర్శి లక్ష్మయ్య అధ్యతన జరిగింది.రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రాములు ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గారికి వదిలేశారన్నారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులకు సన్న దొడ్డిబియ్యంతో సంబంధం లేకుండా 500 రూపాయల వెంటనే చెల్లించాలన్నారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎం రాములు, రమణయ్య, చెన్నయ్య, శ్రీకాంత్ వెంకటమ్మ గోవిందమ్మ అంజయ్య సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

26 ఏళ్ల నుంచి ఉచిత కరాటే శిక్షణ అందిస్తుండడం అభినందనీయం

- శిక్షణ కోసం స్థలం కేటాయింపుకు కృషి చేస్తాం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్
- ఉత్సాహంగా కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరం



నవతెలంగాణ-మహబూబ్ నగర్

జిల్లా కేంద్రంలో గత26 ఏళ్ల నుంచి కింగ్ షోటోకాన్ జహంగీర్ పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత కరాటే శిక్షణ అందిస్తుండడం అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీరోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్ షోటో కాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో వేసవి ఉచిత కరాటే శిక్షణలో భాగంగా ఆదివారం కిక్ బాక్సింగ్ శిక్షణను వినోద్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే శిక్షణ పొందేలా చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కరాటే శిక్షణ తీసుకోవడానికి అవసరమైన స్థలం కేటాయింపు గురించి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళుతామన్నారు. స్థలం విషయమై మున్సిపల్ చైర్మన్ సహకారం తీసుకుందామన్నారు. కరాటే శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు హాజరవుతున్న చిన్నారులకు వచ్చేనెల 5వ తేదీ వరకు అరటిపండ్లు అందజేస్తామని తెలిపారు. అంతకుముందు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆక్రముల్ల హుస్సేని విద్యార్థులకు కిక్ బాక్సింగ్ లో ప్రత్యేక శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో కింగ్ షోటో కాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, కోశాధికారి తిరుపతయ్య. కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఉపాధ్యక్షులు నవీద్ బియబాని, సంయుక్త కార్యదర్శి జహంగీర్ పాషా ఖాద్రీ, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ మహబూబ్నగర్ అధ్యక్షులు కనకంయాదవ్. నాయకులు మోసిన్ ఖాన్, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, ఫయాజ్, అక్బర్, ఖుద్దూస్ బేగ్, సీనియర్ కరాటే విద్యార్థులు నేహాఫాతిమా, ఆర్ష్ జమీల్, అమాన్ ఖాన్, అజయ్, చాంద్ పాషా, తౌహిద్, సాయిప్రణీత్, సాబేర్ పాషా, సోఫియ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి మాత ఆశీస్సులు అందరి పై ఉండాలి :ఎమ్మెల్యే

నవ తెలంగాణ మహబూబ్ నగర్

చౌడేశ్వరి మాత ఆశీస్సులు అందరికీ ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మహబూబ్ నగర్ మున్సిపల్ పరిధిలోని పాలకొండ లో నూతనంగా నిర్మించిన శ్రీ చౌడేశ్వరి మాత ఆలయం లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనాటి సాంకేతిక జీవనంలో మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక చింతన మనిషికి ఎంతో అవసరమని, ప్రశాంత వాతావరణంలో కొలువైన అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించి ఆశీస్సులు పొందాలని ఆయన ప్రజలకు సూచించారు. దేవాలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, పటేల్ శ్రీనివాస్ రెడ్డి, శివుడు, అంజనేయులు, గోపాల్ శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



అకాల వర్షం అతలాకుతలం

- గాలివాన బీభత్సం.. ఏడుగురు మృతి
- తెలకపల్లి,తిమ్మాజీపేటలో పిడుగుపాటుకు బాలుడు,వ్యక్తి
- తాడురులో కొళ్ల ఫారం షెడ్డు కూలి నలుగురు మృతి, ముగ్గురు పరిస్థితి విషమం
- అనేకచోట్ల ఎగిరిపోయిన కాటన్ మిల్ రేకులు
- విరిగిన స్తంభాలు చెట్లు

నవతెలంగాణ-
ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అకాల వర్షాలకు పలు చోట్ల పిడుగుపాటుతో మనుషులతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. తొలి ఆయుట కురిసిన వర్షాలకు ప్రతి ఏటా నష్టం జరుగుతూనే ఉంది. నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులో అయ్యప్ప దేవాలయం దగ్గర కోళ్ల ఫారం లో పనిచేస్తున్న కార్మికులు గోడకూలి వెంకటయ్య అమ్ములు, మరో ఇద్దరు అడ్డా కూలీలు చనిపోయారు.చిన్న నాగులు పార్వతమ్మ రాజుల పరిస్థితి విషమంగా ఉంది. వారిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.అదేవిధింగా బిజినపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలో పిడుగు పడి గోపాల్ రెడ్డి (45) మృతి చెందారు. మంతటి చౌరస్తాలో కారులో కూర్చున్న వేణుగోపాల్ కి పక్కనే వున్న రేకుల షెడ్డు ఇటుక పెళ్ల ఎగిరి వచ్చి పడి గ్లాస్ గుచ్చుకొని మృతిచెందారు. ఉరుములు, మెరుపులు వస్తున్నాయి. పిడుగులు పడేటట్టు ఉన్నాయి. వెంటనే చెట్టు కిందికి వెళ్ళు అని తండ్రి చెప్పిన మాట పిడుగుపాటు అయి ఓ బాలుడి ప్రాణాలు తీసింది. వివరాలలోకి వెళితే తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, అతని కుమారుడు లక్ష్మణ్(13) ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న పొలాలలోకి మేకలను మేపడానికి వెళ్లారు. సాయంత్రం తర్వాత భారీ ఈదురు గాలులు.. ఉరుములు.. మెరుపులతో వర్షం ప్రారంభం అయ్యింది. తన కుమారుడికి ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని భయపడి.. పిడుగులు పడేటట్లున్నాయి బిడ్డ వెంటనే ఆ చెట్టు కిందకు వెళ్ళు అని చెప్పాడు. దీంతో ఆ బాలుడు చెట్టు కిందకు వెళ్ళగానే పెద్ద ఎత్తున ఉరుము .. మెరుపులతో బాలుడు కూర్చున్న చెట్టుపై పిడుగు పడింది. పైగా బాలుని వద్ద సెల్ ఫోన్ ఉండడంతో ఆ ఫోన్ కూడా పేలి బాలుడి ప్రాణాలను తీసింది. నా కొడుకుకు ప్రమాదం జరగకూడదు అని చెట్టు కిందకు పంపిస్తే.. ప్రాణాలు పోయాయి కదా అని ఆ తండ్రి పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.. విషయం తెలిసిన వెంటనే కొంతమంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రెండు రోజుల క్రితం ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామంలో పిడుగుపాటుకు ఉషమ్మ అనే మహిళ చని పోయింది. అదేరోజు చెన్నారం గ్రామ సమీపంలో ఉన్న కాటన్ మిల్ రేకులు లేచిపోయాయి. మరో డబ్బా ఎగిరి రోడ్డుపైకి వచ్చింది.15 రోజుల లో పదిమంది, 20 మూగజీవాలు కూడా మృత్యు వాత పడ్డాయి. చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా తో పాటు మూగజీవాలకు నష్టపరిహారం చెల్లించాలని పలు పార్టీలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.





తిమ్మాజీపేటలో..



తెలకపల్లిలో..



గండీడ్‌లో..



తాడురులో..

ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది.పలుచోట్ల చెట్లు విరికిపోగా,నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీప్రాణం నష్టం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరుమండలం ఇంద్రకల్ గ్రామ పరిధి లోని కోళ్లఫారం రేకుల షెడ్డు కూలి నలుగులు కార్మికులు చని పోయారు. మృతుల్లో ముగ్గురు పెద్దలు ఓచిన్నారి ఉంది. అదేవిధంగా తెలకపల్లికి చెందిన లక్ష్మణ్ (12).పొలం వద్ద తండ్రికి అన్నం ఇవ్వడానికి వెళ్లారు. అంతలో వర్షం రావడంతో వర్షం లో బాలుడు కుర్చున్న చెట్టుపైన పిడుగు పడింది. అక్కడి ఉన్న బాలుడి ప్రాణం తీసింది. తిమ్మాజీపేటలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందారు.బిజినపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలో పిడుగు పడి గోపాల్ రెడ్డి (45) మృతి మంతటి చౌరస్తాలో కారులో కూర్చున్న వేణుగోపాల్ కి పక్కనే వున్న రేకుల షెడ్డు ఇటుక పెళ్ల ఎగిరి వచ్చి పడి గ్లాస్ గుచ్చుకొని మృతి చెందారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

నవతెలంగాణ- గండీడ్

మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వీచినఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించాయి. భారీ వర్షానికి సాలార్ నగర్,పెద్దవార్వాల్, జక్లపల్లి,చిన్న వార్వల్, గ్రామాలలోఈదురు గాలులతో కూడిన భారీ వర్షంనికి చెట్లు,స్తంభాలు కూలి పోయాయి. విద్యుత్ లైన్ లపై చెట్లు కొమ్మలు పడడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.గాలి దుమారానికి సాలార్ నగర్ గ్రామంలో ఓ భారీ వృక్షం కూలిపోయి ఈడిగి నర్సిములు ఇంటిపై పడడంతో ఇంటి కప్పు బండలు విరిగిపోయాయి పకృతి విపత్తు వల్ల నష్టపోయిన గ్రామస్తులను ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలి



అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా తాడూరు, తెలకపల్లి ఉప్పురంతల మండల పరిధిలో పిడుగు పడి ఎనిమిది మందికి పైగా చనిపోయారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. మూగజీవాలకు సైతం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాం. పిడుగుపాటుతోపాటు వర్ష బీభత్సానికి గురికాకడా ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా పాత ఇండ్లలో పూరి గుడిసెలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

వర్ధం పర్వతాలు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నాగర్ కర్నూల్

పదవి పాయే..బిల్లులు రాకపోయే

- అప్పులు చేశాం గ్రామాల అభివృద్ధికి పాటుపడ్డాం.
- మమ్ములను అదుకునేది ఎవరు ?
- చేసిన పనులకు చెక్కులు బోన్స్ అయ్యే.
- అయోమయంలో మాజీ సర్పంచులు.



నవతెలంగాణ- బాలానగర్.

బాలానగర్ మండల పరిధిలోని 37 గ్రామపంచాయతీలలో గ్రామ సర్పంచ్‌ల పై ఒత్తిడి తెస్తూ రైతు వేదికలు నిర్మించాలి. స్మశాన వాటికలు నిర్మించాలి. కొత్త గ్రామ పంచాయతీలు నిర్మించాలి. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటూ అధికారులు సర్పంచ్లను వేధించడంతో సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మాజీ సర్పంచులు అయోమయంలో పడ్డారు. కొత్త ప్రభుత్వం వచ్చిన సమస్య పరిష్కారం అవుతుం దేమోనంటే ఎన్నికల కోడ్లు రావడంతో ఎక్కడి చెక్కులు అక్కడ చెక్కులు అక్కడ బోన్స్ అయి పోయాయని మాజీ సర్పంచులు తెలిపారు. అయితే చెల్లుబాటు కాక ఇప్పటికీ గ్రామ సర్పంచులు నూటికి మూడు రూపాయల చొప్పున మిత్తి చెల్లిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం శూన్యంగానే ఉంది కొత్త ప్రభుత్వం లోనైనా చేసిన పనులకు చెక్కులు డబ్బులు మంజూరు అవుతాయో మన అటేఅన్ని చెక్కులు బోన్స్ కావడంతో సర్పంచులు అయోమయంలో పడ్డారు సర్పంచ్ల పదవీ కాలం అక్టోబర్ వరకు పెంచడంతో ఇక మన పని ఇంతేనా అని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామపం చాయతీలలో పరిశ్రమలు ఉన్నప్ప టికీ ఆ గ్రామ పంచా యతీలో డబ్బులు ఎస్‌టిఓలో సూయిస్తు న్నప్పటికీ డబ్బులు డ్రా మాత్రం కావడంలేదని వారు ఆవేదన చేశారు ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం సర్పంచ్లను ఆదుకొంటూ చేసిన పనులకు డబ్బులు చెల్లిస్తే చాలని వేడుకుం టున్నారు. పాత సర్పంచ్ల పనులను కొత్త ప్రభుత్వం అసలు పలకరించే లేదని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు అంటున్నారు.

గ్రామాలల్లో అభివృద్ధి పనులు చేయాలంటూ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు, అధికారులపై పడ్డారు. అధికారులు సర్పంచ్లను ఒత్తిడి చేస్తూ స్మశాన వాటికలు, రైతు వేదిక భవనాలు,గ్రామపంచాయతీ భవనాలు ,సీసీ రోడ్లు పలు అభివృద్ధి పనులను చేయాలంటూ వెంబడిపడి సర్పంచ్లతో పనులు చేయించారు. చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో ఒక్కొక్క సర్పంచ్ లక్షల కొలది అప్పులు చేసి తాళిబొట్టు తాకట్టు పట్టిన అప్పులు తీరడం లేదని సర్పంచులు వాపోయారు.





జూన్10న ఉపాధి హామీ రక్షణ కోసమే రాష్ట్ర సదస్సు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు



నవతెలంగాణ- మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉపాధి హామీ రక్షణ కోసం జూన్10న రాష్ట్ర సదస్సును జయపద్రం చేయాలని తెలంగాణ వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆ సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కడియాల మోహన్ పోలే జగన్ లతో కలిసితో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ రక్షణ కోసం జరిగే రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథులుగా గ్రామీణ అభివృద్ధి. పంచాయతీరాజ్ శాఖ మాత్యులు సీతక్క .రాజ్యసభ సభ్యులు (ఎంపీ) శివదాసన్ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి నాగయ్య ఆర్ వెంకట్రాములు హాజరవుతారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా పార్లమెంటులో యూపీఏ వన్ ప్రభుత్వానికి వామపక్షాల మద్దతు ఇవ్వడం ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయడం జరిగిందన్నారు .దీని ఘనత వామపక్షాలదన్నారు. మన రాష్ట్రంలో 54 లక్షల జాబ్ కార్డులలో కోటి 20 లక్షలహామీని పటిష్టంగా అమలు చేయడం కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ధరలకు అనుగుణంగా కూలీలందరికి పనికల్పి ంచడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి పని చేస్తున్న కూలీలకు కనీసం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితం రావడంలేదని, మండుటెండలో పనిచేసిన రోజు కూలి 90 రూపాయల లోపు పడుతుందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని ప్రదేశంలో టెంట్లు, మంచినీరు మొదలగు సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరి అయిన వేతనాలు రాకపోవడం దారుణమన్నారు. ఉపాధి పని ప్రదేశాలలో టెంట్లు, మంచినీరు సౌకర్యాలు ఉండాలని చట్టంలో చెబుతున్న అవి అమలు జరగకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి ఆరు వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో మంచినీరు టెంట్లు మొదలగు సౌకర్యాలు కల్పించాలని పలుగు, పారా పదునుకు ప్రత్యేక నిధి కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ రాష్ట్ర సదస్సు కు ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్ సిబ్బంది మెట్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని వారు కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు హన్మంతు, సహాయ కార్యదర్శి బాజుల పాండు, నాయకులు జంగయ్య, దున్న ఖాదర్ ,తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఏం.వీ. రామన్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని ఎన్వి రామన్ హైస్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈలో పదవ తరగతి పరీక్షల లో తెలుగులో ఒకే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 100కు 100 మార్కులు సాధిం చారు. దీంతో ప్రతిభ కనబరిచిన తెలుగు ఉపాధ్యాయులు తిరుమలేష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.







పూరి సురేష్ శెట్టికి డాక్టరేట్




నవతెలంగాణ - వనపర్తి

వనపర్తికి చెందిన వాసవీ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. తమిళనాడులోని హెూసూర్ లో విజయన్ అకాడమీ ఫౌండర్ ఏ ఐ సీ ఏ అడ్వైజరీ బోర్డు మెంబర్ మాస్టర్ బాబు విజయన్, ఇండియా, ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ డాక్టర్.పీ రాధాకృష్ణన్, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్, డాక్టర్ ఎస్. రవి చంద్రన్ చేతుల మీదుగా అరుదైన"గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం"చేశారు. ఈ సందర్భంగా పూరి సురేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో తాను చేసిన సేవలను గుర్తించి ఇంతటి అరుదైన గౌరవం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

- సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం డీ జబ్బార్



నవతెలంగాణ - వనపర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం డీ జబ్బార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి యనముల రేవంత్ రెడ్డి గత డిసెంబర్ లో నిర్వహించిన శాసన సభ ఎన్నికల సందర్భంగానూ, ప్రస్తుతం జరిగిన ఎంపీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో రైతులకు రెండు లక్షల రుణమాఫీని ప్రకటించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ పూర్తి అవ్వగానే రాష్ట్ర రైతాంగం మేలు కోరుతూ రెండు లక్షల రుణమాఫీ హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభం కానుం డడంతో రైతులంతాధాన్యం, ఎరువుల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకుండా వెంటనే రుణమాఫీ చేపట్టాలని కోరారు. రుణమాఫీ అమలయితే బ్యాంకులు రైతులకు క్రాప్ లోన్లు ఇచ్చి ఆదుకుంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 18 నెలల కిందట పూర్తి సీపీఐ(ఎం) ఎర్ర జెండా పట్టి వాళ్ల జిల్లాల్లోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి అందులో నివాస స్థలాలను ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేశారు. వారికి ఇండ్ల స్థలాల విషయమై సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన సందర్భంగా హామీ ఇచ్చారని అన్నారు. సీఎం హామీ మేరకు నిరుపేదలందరికీ 150 గజాల ఇండ్ల స్థలాలను కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంలో ఇప్పటికే మార్కెట్లోకి నాసిరకం విత్తనాలు చాలా వచ్చాయని వార్తలు వస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు అధికారులు ప్రతి మండలం జిల్లా కేంద్రాల్లో తనిఖీలను చేపట్టి, రైతులందరికీ నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పట్టణం గ్రామంలో 200 యూనిట్ల కరెంటు ఉచిత హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, లబ్ధిదారులందరికీ జీరో బిల్లులు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు.

మే 30 నుంచి.. జూన్ 1 వరకు..
సీపీఐ(ఎం) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

నవతెలంగాణ - వనపర్తి

మే నెల 30 31 జూన్ 1వ తేదీ వరకు సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, ఎస్ వీరయ్య, టీ సాగర్, రాష్ట్ర నాయకులు అబ్బాస్, రమేష్ శిక్షణ తరగతులు ముఖ్య అతిథులుగా పాల్గొని క్లాసులు బోధిస్తారని తెలిపారు. ఈ క్లాసులకు వనపర్తి జిల్లాలోని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనాధలుగా చిన్నారులు



నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కొండన్న, సంధ్య దంపతులు ఇద్దరు మృతి చెందడంతో వారిద్దరు పిల్లలు అనాధలుగా మిగిలారు. ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీ అంజనేయ స్వామి గుడి వెనకల గల దాసరి కొండన్న, పద్మ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు, కూలి పని చేస్తూ జీవనం కొనసాగించేవారు. వీరికి ఇద్దరు సంతానం సాయి(4) వివేక్ (3) ఇద్దరు మగ పిల్లలు. గత పది నెలల క్రితం వీరి పిల్లల తల్లి సంధ్య ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. సంవత్సరం గడవకముందే పిల్లల తండ్రి శనివారం కొండన్న కొత్తకోట నేషనల్ హైవే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు . దీంతో ఇద్దరు చిన్నారులు అనాధలుగా మిగిలారు. వీరి తల్లిదండ్రులు చనిపోవడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి, వీరిది పేద కుటుంబం, దాతలు తమ వంతు సహకారం అందించాలని వారి బంధువులు కోరుతున్నారు.

పండ్ల తోటల పెంపకానికీ..
దరఖాస్తు చేసుకోండి



నవ తెలంగాణ - వీపనగండ్ల

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 20 24 - 2025 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో మామిడి, జామా, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, సపోటా, ఆయిల్ ఫామ్, బత్తాయి, అల్ల నేరేడు, తోటలు పెంచుకోవడానికి అవకాశం ఉంది అన్నారు . 5 ఎకరాల లోపు ఎస్సీ ఎస్టీ చిన్న మరియు సన్న కారు రైతులు అర్హులన్నారు .కొబ్బరి గట్ల వెంబడి నాటుకోవడానికి మాత్రమే, డ్రాగన్ ఫ్రూట్స్ కేవలం ఆఫ్ ఎకరా మాత్రమే అవకాశం ఉంటుందన్నారు .ఉపాధి జాబ్ కార్డు కలిగిన వారు, బోరు బావి కలిగి, విద్యుత్ సౌకర్యం ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు పత్రం తో పాటు పట్టాదార్ పాస్బుక్ , బ్యాంక్ అకౌంట్ , ఆధార్ కార్డు, ఉపాధిజాబ్ కార్డ్, పాన్ కార్డ్, జిరాక్స్ తో పాటు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు మూడు, గ్రామపంచాయతీ తీర్మానం తో పాటు ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి, లేదా ఉపాధి హామీ పథకం ఏపీఓ గారికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తోటలు పెంచుకోవడానికి గుంతలు తీయడానికి ,మొక్కలు నాటడానికి, మొక్కకు ఊత కర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెల నెల పర్యవేక్షణ చేయుటకు ఇలా ఒకటి నుంచి మూడు సంవత్సరాల యాజమాన్య డబ్బులు 100% ఉపాధి హామీ పథకం నుండి రైతులకు చెల్లించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా తోటలకు డ్రిప్పు సౌకర్యం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

వీపనగండ్ల మండలంలో..
ముమ్మరంగా పూడికతీత పనులు

- పెరుగనున్న నీటినిల్వలు
- చెరువు మట్టి చేనుకు భూసారం పెరుగుదలకు మేలు
- కూలీలకు ఉపాధి



నవ తెలంగాణ - వీపనగండ్ల

మండలంలోని గోవర్ధనగిరి, రంగవరం, కల్వరాల, సంగినేనిపల్లి, బొల్లారం పలు గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు చెరువు పూడిక తీత పనులను చేపట్టారు. ఈ పనుల వల్ల కూలీలకు పని దొరుకుతుంది. చెరువుల్లో పూడికతీత పనులతో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. గతంలో గ్రామాలలో చెరువులు ఎండిపోకుండా నీటి నిల్వ ఉండేది. ఈ సంవత్సరం చెరువుల్లో పూర్తిగా నీరు ఇంకిపోవడంతో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయడానికి కూలీలకు పనులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. చెరువు మట్టి చేనుకు భూసారం పెరుగుదలకు చేస్తుంది. గతంలో ఎండాకాలంలో ఎండిపోయినప్పుడు చెరువుల్లో నుంచి మట్టిని తీసి మట్టిని వ్యవసాయ పొలంలో వేసుకునేవారు. ఇప్పుడు ఈ పద్ధతిని చాలా తక్కువ రైతులు పాటిస్తున్నారు. రైతులు తమ చేనులో మట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు అనేక పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది. చెరువు మట్టిని చేనులో వేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రైతులు పండించే పంటలు అధిక దిగుబడులు వస్తాయి. చెరువు మట్టిని చేనులో వేయడం ద్వారా ఆమ్ల క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు. నేలలోని గ డత తగ్గుతుంది. మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించుకోవచ్చు. మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కలుపు వర్షా బావ పరిస్థితుల ను కూడా ఎదుర్కొనే శక్తి నేలకు ఉంటుంది. దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వస్తుంది. నేల సారవంతంగా మారుతుంది. వేసవిలో చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిలువ పెరుగుతుంది. ఎక్కువ నీరు నిలిచే అవకాశం ఉంటుంది. పొలాలలో వేయడం ద్వారా నేల సారవంతం అవుతుంది. చెరువు మట్టిలో ఎక్కువగా ఉండి పోషకాల వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది .అధిక దిగుబడి పొందవచ్చు అని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. చెరువు పక్కల ఉన్న రైతుల భూముల పొలాలకు మట్టిని కొట్టుకోవడానికి తక్కువ ఖర్చు అవుతుందని వారు మట్టిని కొట్టుకోవడం జరుగుతుంది. కానీ పొలాలు దూరంగా ఉన్న రైతులు మట్టిని కొట్టుకోవడానికి ఖర్చు ఎక్కువ అవుతుందని ఆసక్తి చూయించడం లేదు. గతంలో ఉపాధి పథకంలో చెరువు మట్టిని రైతు ల పొలాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించుకుంటే ప్రభుత్వమే ట్రాన్స్పోర్ట్ ఖర్చు భరించేది. ప్రస్తుతం ట్రాన్స్పోర్ట్ ఖర్చు రైతులకు భారంగా మారుతుందనీ ప్రభుత్వమే భరించాలని మండల రైతులు కోరుతున్నారు.



చెరువుల పూడికతో నీటి నిల్వలు పెరుగుతాయి..

చెరువుల్లో పూడికతీతతో నీటి నిలువ పెరుగుతుంది.
చెరువు మట్టిని చేనులో వేసుకోవడం ద్వారా మంచి లాభాలు ఉంటాయి.

- ఎత్తం వెంకటయ్య రైతు వీపనగండ్ల



నేల సారవంతంగా మారుతుంది...

రైతులు వేసవికాలంలో చెరువు పూడిక మట్టిని తమ పంట పొలంలో వేసుకోవడంతో వ్యవసాయ పొలం చేను భూసారం పెరుగుతుంది. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది .రైతులకు చెరువు మట్టి ఎంతో మేలు చేస్తుంది.

- దాకేశ్వర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీనికా ఫంక్షన్ హాల్లో ఆదివారం 1993- 94 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థినీ , విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈవిధంగా కలుసుకోవడం ఎంతో శుభ పరిణామం అని, ఏ విధంగా కలిసిమెలిసి ఉండడం ద్వారా ప్రేమానురాగాలు పెరుగుతాయని, ఆపత్కాల పరిస్థితిలో చేదోడుగా వాదుడుగా ఉంటారని అన్నారు. అందరు కలుసుకోవడంతో మనసు ఎంతో ఉత్తేజితం అవుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ చదువుకున్న మేమందరం ఒక్కొక్కరం ఒక్కో స్థాయిలో ఉన్నామని, ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ తమతో పాటు పదిమందికి చేదోడు వాదుడుగా ఉంటామని అన్నారు.



మదనాపురం: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు అవ్వాలని పూర్వ ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి అన్నారు. మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామంలో ఆదివారం 2003-2004 సంవత్సర పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, విద్యార్థినీలు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వృత్తిలో స్థిరపడ్డ అంశాలపై వివరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరూ అధైర్య పడకుండా చేపడుతున్న వృత్తిని నమ్మకంగా కొనసాగిస్తూ మంచి స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. నాడు పాఠశాలలో చదువుకొని కలిసి ఉన్నట్లుగానే ఎప్పటికీ అలాగే ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయ బృందాన్ని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కరుణాకర్, మాణిక్యప్రభు, బస్వరాజ్, హుస్సేన్ రెడ్డి, ఖాజన్ గౌడ్, కృష్ణయ్య, నిస్సార్, నిర్మల, సరిత, రాధిక, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు




నవతెలంగాణ - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణ , మండల రైతులకు పట్టణంలోని స్టేషన్ రోడ్డులోని ఎంజీ గార్డెన్ ఫంక్షన్ హాల్ పక్కన గల ఆగ్రో రైతు సేవా కేంద్రంలో జీ లుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటలను వేయాలనుకునే రైతులు వారి పొలం పాసుబుక్కు ,ఆధార్ కార్డు, బ్యాంకు బుక్కు జిరాక్స్ తీసుకొని పట్ట ణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 30 కేజీల జీలుగ విత్తనాల సంచి ధర రూ.1,116లకు ప్రభుత్వ సబ్సిడీతో లభిస్తుందని పేర్కొన్నారు. ఇట్టి అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

విద్యుత్ వినియోగదారులు



నవతెలంగాణ - ధరూర్

అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో పట్టణంలో కరెంటు సరఫరాను దాదాపు మూడు గంటల పాటు నిలిపివేశారు. దీంతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని విద్యుత్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాను అందించడంలో విద్యుత్ అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ధరూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గత కొన్ని నెలల కిందట ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సమర్థవంతంగా ధరూర్ లో కరెంటు అందించిన అధికారులు ఇప్పుడు విఫలమవుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇట్టి సమస్యపై స్పందించి ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా అండర్ డ్రైనేజీ పనులు

- దళితవాడలపై చిన్న చూపు..
- పగిలిపోయే స్థితిలో డ్రైనేజీ పైపులు
- ఆందోళనలో స్థానికులు



నవతెలంగాణ - ఊరుకొండ

అధికారుల అలసత్వం.. పట్టింపులేని ధోరణి మూలంగా గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు అత్యుత్సాహంగా ఊరుకొండ మండలంలో అక్కడక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊరుకొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలోని దళితవాడల్లోని మురుగు కాలువల్లో నిర్మించిన అండర్ డ్రైనేజీ పైపులైను పై మట్టి కప్పలేదని, దీంతో డ్రైనేజీ పైపులు పగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ పైపులు వేసి అసంపూర్తిగా ఉంచడంతో చుట్టుపక్కల ప్రజలు రాత్రి వేళల్లో డ్రైనేజీ కాలువలో పడి పలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కొన్ని వాడల్లో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిగా చేసి.. దళితవాడలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలివేయడం పట్ల దళితులు తమపై చిన్నచూపు ఎందుకని పలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న దళితవాడలో అసంపూర్తిగా వదిలేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మండల అధికారులకు కనిపించడం లేదని స్థానిక ప్రజలు పలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ప్రజా ప్రతినిధులు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ అధికారులు బిల్లులు ఎలా మంజూరు చేశారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బిల్లులు మంజూరు చేయడంలో ఉన్న ఉత్సాహం అధికారులకు పనులు పూర్తి అయ్యింది లేనిది కనిపించడం లేదా అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో మట్టి పూడ్చకపోతే పైపులైన్ పగిలిపోయే ప్రమాదం ఉందని దళిత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు స్పందించి ముచ్చర్లపల్లి గ్రామంలోని దళితవాడలో అసంపూర్తిగా వదిలేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని.. డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి ప్రజాధనం వృధా కాకముందే.. గ్రామస్తులు అసంపూర్తి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో ప్రమాదానికి గురి కాకముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ ప్రజలు కోరుతున్నారు.





గ్రంథాలయ సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు

నవతెలంగాణ-తెలకపల్లి

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చేరుకున్న వారు శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే డిస్మెంటల్ చేసి కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అంతవరకు ప్రత్యామ్నాయ భవనాన్ని ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎంతోమంది నిరుద్యోగ యువతి యువకులు శాఖ గ్రంథాలయంలో చదువుకుంటూ ఉద్యోగ నోటిఫికేషన్‌లకు సిద్ధమవుతున్నారన్నారు. వారికి తగినట్టుగా సబ్జెక్టుల వారిగా గ్రంథాలు లేకపోవడం, పోటీ పరీక్షలకు అవసరమగు నెలవారి మ్యాగజైన్స్, ఇతర మెటీరియల్ గ్రంథాలయంలో లేకపోవడం లోటుగా ఉందన్నారు. దీన్ని గ్రంథాలయ సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేష్, విజయ్ గౌడు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-వంగూరు

మండలంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వం పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20ఏండ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన ఉపాధ్యాయులను పిలిపించి ఘనంగా సన్మానం నిర్వహించారు. 20ఏండ్ల క్రిందట చదివిన అందరూ కలుసుకొని ఆప్యాయత ప్రేమ స్నేహ బంధం అప్పటి చిలిపి చేష్టలను మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఒక్కరు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువుతూనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని, చదివిన తరువాత ఏ పనైనా చేయవచ్చు కానీ చదువు లేకుండా ఎవరు కూడా ముందుకు వెళ్లలేదని గుర్తు చేశారు. బాల్యంలో చదివిన చదువులు ఎంతో తీపి జ్ఞాపకాలకు గుర్తని విద్యార్థులు నిరూపించారు. అదేవిధంగా జీవితంలో ఎంత ఎదిగినా స్నేహ భావంతో



ఉన్నంత మరొక దాంట్లో లేదన్నారు. మీ పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు సర్దార్ చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్నకేశవులు, శంకర్ నాయక్, శ్రీనివాసులు, అటెండర్ రాజబాబు, బలరాం, లింగమ్మను ఘనంగా సన్మానించారు. ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఎన్ని పెట్టుకున్న తక్కువని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, భానుచందర్, శ్రీను, సురేష్, రాకేష్, మల్లేష్, మునిందర్, నిర్మల, స్వప్న, కైరావతి, రాజేశ్వరి, రషీదా, మాధవి, సంధ్య, అరుణ, సైదులు, జహంగీర్, శివ, మాధవులు, తదితరులు ఉన్నారు.

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

- ఓబీసీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ గౌడ్



నవతెలంగాణ-ఊరుకొండ

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ రూ.500 ఇస్తామని చెప్పడం రాష్ట్ర రైతాంగాన్ని గందరగోళ పరుస్తుందని.. అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని ఓబీసీ జిల్లా అధ్యక్షులు, నర్సంపల్లి మాజీ సర్పంచ్ వాగుల్లాస్ నిరంజన్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి.. ఇప్పుడు మాత్రం కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని మాట మార్చడం విడ్డూరంగా ఉందని విమర్శిం చారు. యాసంగి పంటకు వడ్లు పండించే రైతులలో 80శాతం మంది రైతులు దొడ్డు వడ్లు మాత్రమే పండిస్తారని, 20శాతం రైతులు మాత్రమే సన్నవడ్లు పండిస్తారన్నారు. ఇందులో అత్యధికం చిన్న, సన్నకారు రైతులు మాత్రమే ఉంటారని గుర్తు చేశారు. దీని ద్వారా పేద రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కాబట్టి రైతులందరికీ.. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగం గందరగోళానికి గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి వడ్లు పండించే రైతులందరికీ ఒకే రకమైన బోనస్ చెల్లించే విధం గా చూడాలన్నారు. లేకపోతే రైతాంగం ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రైతులందరికీ సమన్యాయం జరిగేలా రూ.500 బోనస్ అన్ని రకాల వడ్లకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడు అనిల్ రెడ్డి'



నవతెలంగాణ-ఊరుకొండ

ఆపదలో ఉన్న బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు ఆపద్బాంధవుడు జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి అన్నివేళలా అండగా నిలబడతారనీ జడ్చర్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ దార బంగారయ్య అన్నారు. ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి బచ్చన్న(50) అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకొని పేద ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందించి సేవ చేయడానికి ఎంతగానో కృషి చేస్తున్న పేదల పెన్నిధి, ఆపద్బాం ధవుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి తక్షణ సహా యం కింద రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు కుడుముల తిరుపతి రెడ్డి వెయ్యి రూపాయలు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మారుపాకుల రాఘవేందర్ గౌడ్ వెయ్యి రూపాయలు మొత్తం రూ.7వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముచ్చర్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుడుముల శ్రీకాంత్ రెడ్డి, జడ్చర్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ దార బంగారయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు యాదవ్, దార వెంకటయ్య, నీరటి ఆంజనేయులు, గుండాల చెన్నయ్య, దన్నడి వెంకటేష్, ఆంజనేయులు గౌడ్, ఓర్స్ రాజు, మహేష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..
ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-బిజినేపల్లి

మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము కింద ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు కొరకు ఈ కింది వెబ్‌సైట్‌ని సంప్రదించాలని **https://www.tswreis.ac.in** ఆమె తెలిపారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



నవతెలంగాణ-కల్వకుర్తి

కాంగ్రెస్ పార్టీ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికి అమలు చేయలేదన్నారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరారు. మంత్రి సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం సరైనది కాదన్నారు. యాసంగిలో 80శాతం మంది రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు చింత ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, బాల్ రెడ్డి, బాలస్వామి, అశోక్, వెంకటేశ్వర్లు, జగన్ పాల్గొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- కిలో100కు చేరిన పచ్చిమిర్చి, టమాట
- అమాంతం పెరిగిన ఆకుకూరల ధరలు





నవతెలంగాణ-కల్వకుర్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అన్ని రకాల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. గత 15 రోజులుగా ఈదురు గాలులతోపాటు అడపా దడప వర్షాలు కురుస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వర్షాల వల్ల టమాట, పచ్చిమిర్చి తదితర కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. వారం రోజుల క్రితం కిలో రూ.40 ఉన్న పచ్చిమిర్చి నేడు ఏకంగా కిలో రూ.100కు చేరింది. దీంతో పచ్చిమిర్చి కొనాలంటేనే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సామాన్య ప్రజలు వాపోయారు.



పచ్చిమిర్చికి తోడు టమాటా ధర సైతం కిలో రూ.40కి చేరింది. బెండకాయ కిలో రూ.60, దొండకాయ కిలో రూ.60, వంకాయ కిలో రూ.60, దోసకాయ కిలో రూ.80 ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల కూరగాయల ధరలు అంతకంత పెరిగిపోయాయి. ఆదివారం కల్వకుర్తి కూరగాయల మార్కెట్‌లో పెరిగిన ధరలు చూసి పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే వాటికి తోడు కూరగాయల ధరలు పెరగడం ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. మరో నెల రోజుల పాటు కూరగాయల ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు. జూన్ మాసంలో కొత్త పంటలు చేతికి వస్తేనే కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

- ఆకుకూరల ధరలకు సైతం రెక్కలు..

కూరగాయల ధరల సంగతి అటుంచితే ఆకుకూరల ధరల సైతం భారీగా పెరిగాయి. గతంలో రూ.10కి నాలుగు పాలకూర కట్టలు ఇచ్చే వ్యాపారులు ఇప్పుడు పది రూపాయలకు రెండు కట్టలు కూడా ఇవ్వడం లేదు పాలకూరతో పాటు చుక్కకూర, సోయి కూర, పుంటి కూర, గంగపాయల కూర తదితర ఆకుకూరల ధరలు సైతం భారీగా పెరిగి పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాటికి తోడు కొత్తిమీర, పుదీనా రేట్లు సైతం వ్యాపారులు భారీగా పెంచి విక్రయిస్తున్నారు. గతంలో కొత్తిమీర పది రూపాయలకు రెండు కట్టలు ఇచ్చే వ్యాపారులు ఇప్పుడు పది రూపాయలకు ఒక కట్ట మాత్రమే ఇస్తున్నారు. దీంతో పేద మధ్య తరగతి ప్రజలు వాటిని కొనడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

అన్ని రకాల ధరలు ఇలా పెరుగుతూ పోతే ఏం తినాలి ఎలా బతకాలంటూ పేద మధ్యతరగతి ప్రజలు ఆవేదనటం చేస్తున్నారు. ధరల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు పెట్టమవుతున్నాయి. ఇప్పటికైనా ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా పెరుగుతున్న కూరగాయల ధరలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు విద్యుత్ స్తంభాలు
- పలు ప్రాంతాలలో పిడుగుపాటు

నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

కల్వకుర్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటలకు మెల్లమెల్లగా మొదలైన వర్షం అరగంటలోనే భారీ వర్షంగా మారింది. ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులతో ఆకాశం దద్దరిల్లింది. దాదాపు గంటపాటు భారీవర్షం కురవడంతో పల్లెలు పట్టణాలు అల్లకల్లోలమయ్యాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడగా ప్రధాన రహదారులపై భారీ వృక్షాలు సైతం నేలకులాయి. పెద్ద ఎత్తున ఈదురు గాలులు రావడంతో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ స్తంభాలు కూలిపోవడం పట్టణంతోపాటు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈదురు గాలులు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కల్వకుర్తి పరిసర ప్రాంతాలలో





దాదాపు 3 పిడుగులు పడ్డాయి పిడుగుల దాటికి ఇంట్లో ఉన్న చిన్న పిల్లలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పలుచోట్ల రేకుల షెడ్ల పై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు సిబ్బంది కష్టపడుతున్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో
మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల కేంద్రంలో గల బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో మిగులు సీట్ల భర్తీకి విద్యార్థినీల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినిలు ఈనెల 31వ తారీకు వరకు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విజేతగా హవీష్ రెడ్డి



నవతెలంగాణ-కందనూలు

ఇండియా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన అండర్-7 విజేతగా వర్గాల అద్విక్, పి.సహరి గెలుపొందారు. అదేవిధంగా అండర్-9 విజేతగా ఎస్.రుత్విక్ రెడ్డి, పి.కృతిక గెలుపొందారు. అదేవిధంగా అండర్-11 విజేతగా అనిష్, సాహితీ గెలుపొందారు. అండర్-13లో విజేతగా పి.హవీష్ రెడ్డి, అపూర్వ మిత్ర గెలుపొందారు. అండర్-15 విభాగంలో గాజుల మనోరంజన్, గీతా, దుర్గా విజేతలుగా గెలుపొందారు. ఈ కార్యక్రమం నాగర్‌కర్నూల్ మోడల్ స్కూల్‌లో సీబీసీసీ చెస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ఎం.రామచంద్ర రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ తిరుపతి రెడ్డి, చెస్ కోచ్‌లు, ప్లేయర్స్ వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

పిడుగుపాటుకు బాలుడు మృతి

నవతెలంగాణ-తెలకపల్లి



పిడుగు పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్(12) అనే బాలుడు ఆదివారం తన తండ్రి వెంక టయ్యతో కలిసి మేకలు మేపడానికి వ్యవసాయ పొలానికి వెళ్లాడని సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమై పిడుగు పడి బాలుడు లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కళ్ళ ముందరే కుమారుడు పిడుగు పడి చనిపోవడంతో తండ్రితో పాటు కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశాన్నంటాయి. బాలుడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. బాలుని మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఎస్సీ గురుకుల కళాశాలలో
మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ- అచ్చంపేట

ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆర్సీఓ వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. **www.tswreis.ac.in** వెబ్‌సైట్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ, వృత్తి విద్య కోర్సులలో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

మాజీ మంత్రి కేటీఆర్, ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం

శవ రాజకీయాలతో ఉనికిని కాపాడుకోలేరు

- దమ్ముంటే బహిరంగ సభకు సిద్ధంకండి కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- తెరిచిన పుస్తకం మంత్రి జూపల్లి కృష్ణారావు
- అసత్య ప్రచారాలు మానుకొని ఉనికిని కాపాడుకోండి



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

కేసీఆర్ నియంత పాలన, గడీల పాలనకు చరమగతం పాడాలని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బీ-ఫామ్ ఇస్తే బీ-ఫామ్‌తో గెలిచిన బీరం హర్షవర్ధన్ రెడ్డి గెలిచిన మూడు నెలలకే బీఆర్ఎస్ పార్టీలో చేరి భారీగా డబ్బులు దండుకొని కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు తీరని అన్యాయం చేసి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చిన ఆయనకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. కక్ష సాధింపులతో జూపల్లి కృష్ణారావు వర్గం నాయకులపై పోలీసుల అన్నదండలతో అనేక కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలు చేసిన వాటికి భయపడకుండా జూపల్లి వెంట ఉండి అన్నిటిని భరించి చివరకు ఎమ్మెల్యే బీరంను ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు పట్టం కట్టి మంత్రి పదవిని ఇప్పించారన్నారు. ఇది ఆయన నీతి నిజాయితీకి ఆదర్శమని మండల మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగపురి విష్ణు, సింగిల్ విండో అధ్యక్షులు బుడుగు శ్రీనివాసులు యాదవ్, పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ ఆదేర్ల వెంకటేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఒక్క బీరం హర్షవర్ధన్ రెడ్డిని గెలిపిస్తే గెలిచిన 3 నెలలకే బీఆర్ఎస్ పార్టీలో చేరి భారీగా డబ్బులు సంపాదించుకొని, భూ కబ్జాలు పోలీస్ వ్యవస్థను తన అండదండలతో నిర్వీర్యం చేస్తూ తక్కిన పార్టీలపై కేసు నమోదు చేసి వారిని భయభ్రాంతులకు గురిచేసి అష్ట కష్టాలు పెట్టిన మొక్కవోని ధైర్యంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పారని కానీ ఆయనకి ఇంకా బుద్ధి రాలేదని తాను ఏదో సాధించానని నేను కడిగిన ఆణిముత్యమనీ నిరూపించుకోవడానికి అష్ట కష్టాలు పడుతూ నియోజకవర్గంలో ఎక్కడ ఏ చిన్న పంచాయతీ అయినా, మర్డర్లు అయిన వాటిని మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను అడ్డుపెట్టుకొని శవ రాజకీయాలు చేస్తున్నారని వారు ఘాటుగా విమర్శించారు. గత మూడు రోజుల క్రితం జరిగిన పెంటవెల్లి మండలం లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నాయకులు తన వ్యక్తిగత కారణాలు, భూ కబ్జాలు, తదితర అంశాల కారణంగా ఎవరో మర్డర్ చేస్తే దానిని శవ రాజకీయం చేయడానికి కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తన లబ్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్, పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను తీసుకొచ్చి శవ రాజకీయాలు చేశారన్నారు. ఇలాంటి శవ రాజకీయాలు పునరావృతం అయితే సహించేది లేదని, మీరు ఎక్కడ బహిరంగ చర్చకు సిద్ధమైతే అక్కడకు బహిరంగ చర్చకు మేము సిద్ధంగా ఉంటామని వారు బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. పెద్దకొత్తపల్లి మండలంలోని గంట్రావుపల్లిలో, దేదినేనిపల్లిలో, చిన్న కొత్తపల్లిలో సాతాపూర్ గామాలలో చిన్న చిన్న గొడవ అయితే వాటిని భూతద్దంలో చూపి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిస్ కేసులను పెట్టాలని ఐపీఎస్‌లో ఉన్నత పదవులు అధిరోహించిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అనడం ఆశయాత్మకమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఉన్న వాస్తవాన్ని తెలుసుకొని గ్రామాలకు వచ్చి గ్రామ ప్రజలు రెచ్చగొట్టకుండా వాస్తవాలు మాట్లాడి హుందాతనాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు గొడుగు శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తగిలి కృష్ణయ్య, మాజీ సర్పంచులు ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, వి.సత్యం, విష్ణువర్ధన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగబాబు, మాజీ వార్డ్ మెంబర్ గడ్డి కోపుల ఎల్లయ్య, దేవుని తిరుమలాపూర్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సవనికి ఇండ్లపై లేచిపోయిన రేకులు



- పిడుగు పడి ఒకరు మృతి

నవతెలంగాణ-తిమ్మాజీపేట

మండలంలో మారేపల్లి కాలనీలో ఆదివా రం సాయంత్రం గాలి వానకు ఇండ్లపై రేకులు లేచిపోయి బీభత్సవాన్ని సృష్టించాయి. అలాగే పిడుగు పడి ఒకరు మృతి చెందారు. మెల్లమెల్లి గా ప్రారంభమై ఒక్కసారిగా ఈదురు గాలుల తో వర్షం పడి బీభత్సం సృష్టించింది. మారేపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటయ్య తన వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా పిడుగు పడడంతో అతన్ని జడ్చర్ల ఆస్పత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో చనిపోయాడు. మారేపల్లి కాలనీకి చెందిన రత్నారెడ్డి, నరేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి ఇంటి రేకులు లేసిపోయి పొలాల్లో పడ్డాయి. ఇండ్లలో ఉన్న బియ్యంతో పాటు టీవీలు, ఫ్రిడ్జ్ లు ఇతర వంట సామాగ్రి మొత్తం పాడయ్యా యి. అదే కాలనీకి చెందిన కర్ణాకర్ రెడ్డి రూ. 40లక్షల పైగా విలువచేసే కోళ్ల షెడ్డు పూర్తిగా నేలమట్టం అయింది. అదే షెడ్డులో ఆంధ్ర నుంచి వచ్చిన కూలీలు ఉండగా వారికి స్వల్పంగా గాయాలయ్యాయి.





గ్రామాల్లో కనిపించని.. పంచాయతీ కార్యదర్శులు

జోగులాంబగద్వాల : మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు కనిపించకుండా త్రీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇందుకు ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడం అని తెలుస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఆయా గ్రామపంచాయతీలో పంచాయతీ సర్పంచులు పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన కార్యదర్శులు గ్రామ పంచాయతీలకు సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఎంపీడీవో ప్రత్యేక అధికారులు, వారిపై పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి మరిచారని, నీటి ఎద్దడి, నర్సరీలు, పారిశుధ్య పనులు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయితీలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన కార్యదర్శులు ఇష్టం వచ్చినట్లు విధులకు హాజరవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సమయపాలన పాటించని కార్యదర్శులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ - ధరూర్

ధరూర్ మండల కేంద్రానికి చెందిన జానకమ్మకు మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం మంజూరైన రూ.75వేల ఎల్ఓసీ లెటర్‌ను గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జానకమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, ఎంపీపీ విజయ్ పాల్గొన్నారు.

ఈదురు గాలులకు.. నేలకొరిగిన భారీ వృక్షం



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి చెట్టు నేలకొరిగిన సంఘటన గద్వాల నుంచి రాయచూర్‌కి వెళ్లే రహదారిపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనాల, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

విరిగిన విద్యుత్ స్తంభం..





ఊట్కూర్ : మండల కేంద్రమైన ఊట్కూర్‌లో ఆదివారం సాయంత్రం గాలి వాన కురిసింది. దీంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ దగ్గర రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం పడిపోయింది. అలాగే చెక్ పోస్ట్ నుంచి బస్టాండ్ కు వచ్చే రహదారిపై అడ్డంగా చెట్టు కూలిపోయింది.

ఈదురుగాలుల వర్షం..

నవ తెలంగాణ - నర్వ

నారాయణపేట జిల్లాలో పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. నర్వ మండల కేంద్రం తో పాటు మండలంలోని రాయికోడ్, పాతర్చెడ్, రాజుపల్లి, జక్కన్న పల్లి, యాంకి, నాగి రెడ్డి పల్లి, లక్కర్ దొడ్డి, లంకాల్, రాంపూర్ తదితర గ్రామాల్లో దాదాపు అర్ధగంట ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగలాడాడు. ఎండ వేడిమి, వడగాడ్పులు, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవ తెలంగాణ - నారాయణపేట

చిన్ననాటి నుంచి ఒకే తరగతి గదిలో చదువుకొని ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు కలుసుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆదివారం నారాయణపేట మండలంలోని జాజాపూర్ జెడ్పీ హెచ్ఎస్‌లో పదవ తరగతి వరకు చదువుకున్న 1998 -1999 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చిన్ననాటి మిత్రులను కలుసుకొని అలనాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 10వ తరగతి వరకు ఒకే తరగతి గదిలో ఒకే క్రీడా మైదానంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు జీవితంలో వివిధ రంగాల్లో స్థిరపడి.. తమకు విద్యా బోధనలు చేసిన గురువులు కురుమన్న, బాలప్ప, ఎల్. లక్ష్మణ్ ,అశోక్, బలరాం, సుదర్శన్ లను పూర్వ విద్యార్థులు శాలువా పూలమాల జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ తాము నేర్పిన విద్యను చక్కగా నేర్చుకొని ఉన్నత స్థానాల్లో నిలిచిన మిమ్మల్ని చూసిన తర్వాత మాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి ఇప్పుడు అందరూ కలుసుకొని తమను సన్మానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తరగతిగదిలో ఎంతో అల్లరి చిలిపి చేష్టలు చిందులు వేస్తూ పాఠాలు విని ఇప్పుడు మీరు ఉన్నత స్థానాల్లో స్థిరపడడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా బీఆర్ఎస్ నేత జన్మదినం

మక్తల్ : భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వర్ యాదవ్ జన్మదిన వేడుకలను మక్తల్‌లో భారత రాష్ట్ర సమితి నేత రాజుల ఆశిరెడ్డి స్వగృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, వర్క మాజీ సర్పంచ్ శివరాజ్ రెడ్డి , ఎం. జయానంద, మైనారిటీ నాయకుడు మన్నన్ షరీఫ్ , వన్నెకారి సంతోష్, గూరుకొండ శ్రీనివాస్, విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఏళ్ల తరబడి.. సమస్యల తిష్ట

- ఇబ్బందుల్లో 13వ వార్డు ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- పరిష్కరించాలని స్థానికుల వేడుకోలు

నవ తెలంగాణ - ఊట్కూర్

ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోక స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఎవరూ వచ్చిన సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారానికి నోచుకోక అలాగే దర్శనమిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని 13 వార్డ్‌లో దాదాపు 200 కుటుంబాలు ఉంటు న్నాయి. దాదాపు 767 మంది ఓటర్లు ఉన్నారు.. సీసీరోడ్ సమస్యలు, కాల్వలపై బెడ్ లేకపోవడం ,పింఛన్లు మంజూరు కాకపోవటం, వర్షంలో కూలిపోయిన ఇళ్లకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందక పోవటం తదితర సమస్యలు దర్శనమిస్తున్నాయి. అభి వృద్ధి పనులు జరిగిన పూర్తిస్థాయిలో మాత్రం సమస్యలు పరిష్కారం కాలేదని 13 వార్డ్ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. గద్వాల్ మజీద్ వెనుక భాగం నుంచి జంగం వారి ఇంటి సమీపం వరకు సీసీ రోడ్డు లేక పోవడంతో వర్షా కాలంలో అయితే రోడ్డుపై నీళ్ల నిల్వ ఉండడంతో నడవలేని పరిస్థితి ఎదురవుతుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబా భవానీ మందిరం వెనుక భాగం నుంచి గిర్ని ఇస్లాం ఇంటి సమీపం వరకు నగిరి ఇంటి సమీపం నుంచి గద్వాల్ మజీద్ సమీపం వరకు మట్టి రోడ్డు ఉండడంతో ఇబ్బందికరంగా మారిందని వెంటనే సీసీ రోడ్లు మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మురుగు కాల్వలు నూతనంగా నిర్మాణం చేసిన వాటికి గద్వాల మజీద్ వెనుక భాగంలో ఉన్న మురికి కాల్వ పై బెడ్ లేకపోవడంతో అలాగే గద్వాల్ మజీద్ నుంచి కొద్ది దూ రంలో ఉన్న మురికి కాల్వ పై బెడ్ లేకపోవడంతో అటుగా వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ,వాహన దారులు, పాదచారులు పేర్కొంటున్నారు. మురికి కాల్వల పై బెడ్ లేని దగ్గర అధికారులు గుర్తించి బెడ్ వేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉర్దూ భవనంకు ఓ గోడ శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. భవనంలో కిటికీలకు తలుపులు పడిపోయాయి.భవనం పై కప్పు నుంచి పెచ్చులూ డిపోతున్నాయని, కరెంట్ కలెక్షన్ లేదని, భవనం కు నూతనంగా కలర్ చేయించాలని అధికారులకు ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షా నికి దాదాపు పది ఇల్లు కూలిపోయాయని నేటి వరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించలేదని బాధిత కుటుంబ సభ్యులు వాపో తున్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం రాకపోవడంతో కూలిపోయిన ఇల్లును అట్లే పెట్టుకోలేక అప్పు చేసి ఇండ్లు కొందరు నిర్మించుకున్నా ... మరికొందరు స్తోమత ఉన్నవారు ఇల్లు నిర్మించుకున్నారు. దివ్యాంగులు దాదాపు నలుగురు ఉన్నట్లు సమాచారం. అహ్మద్ బాబు గిర్ని యూ నుస్ తోపాటు తదితరులు ఉన్నట్లు సమాచారం అలాగే దాదాపు 70 మంది దాకా బీడీ కార్మికులకు సంవత్సరాల తరబడి పని చేస్తున్న వారికి



పింఛన్లు మంజూరు కాలేదని పేర్కొంటున్నారు . కార్మికులను గుర్తించి వెంటనే ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేయాలని కోరుతున్నారు. నిరుద్యోగులు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందాలని ఆశతో దరఖాస్తు చేసుకున్న ఇప్పటివరకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు కాలేదని రహీం(పొర్ల) అసద్ ఖాన్ ఇఫ్తార్ ఎండీ ఇస్మాయిల్ అన్వర్ పాషా ఎండీ జాకీర్ తోపాటు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. 13 వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గతంలో మండల, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసిన ఫలితం కనిపించలేదని ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



వార్డులో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని అనేకసార్లు గతంలో ఉన్న ప్రజాప్రతినిధులకు అధికారులకు విజ్ఞప్తి చేశాం. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్క రించాలి.

- రహీం, 13 వార్డ్ నివాసి, (పొర్ల)







ఆత్మరక్షణకు కరాటే

- మక్తల్ మోడల్ ఆఫీసర్ అనిల్ గౌడ్, మత్స్యకార సంఘ అధ్యక్షులు కోళ్ల వెంకటేష్



మక్తల్ : ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని మక్తల్ మోడల్ ఆఫీసర్ అనిల్ గౌడ్, మత్స్యకార సంఘ అధ్యక్షులు కోళ్ల వెంకటేష్ అన్నారు. మక్తల్‌లో డ్రిగాన్ శోటో ఖాన్ కరాటే - డు - స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మా ట్లాడుతూ కరాటే తో మానసికోల్లాసం, శరీర దా రుఢ్యం, సమాజంలో గౌరవం లభిస్తుందని అన్నారు. అనంతరం కరాటే విద్యార్థులకు ఎల్లో, గ్రీన్ ,ఆరెంజ్ ,బ్లూ, మెరూన్, బ్రౌన్ బెల్టులను 200 మంది చిన్నారులకు అందజేశారు. 10 మంది విద్యార్థులు బ్లాక్ బెల్టును సాధించారు. అనంతరం కరాటే వ్యవస్థాపకులు సలాంబిన్ ఉమర్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణతో పాటు మనలను మనం రక్షించుకుంటామని ఆయన తెలి పారు. ఈ సందర్భంగా కరాటే వ్యవస్థాపకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆద్య ఇన్సిట్యూట్ హారతి, జయశ్రీ, కరాటే చీఫ్ఎగ్జామినర్ . సీ.అమ్రేష్, వైస్ ప్రెసిడెంట్ కె. అంజన్ ప్రసాద్, టోర్నమెంట్ ఇంచార్జ్ ఎం.డీ. సలీం, కరాటే మాస్టర్లు అర్పత్, శేఖర్, మోసిన్, ఫా, ధరణి, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. కేబుల్ గుంత



నవ తెలంగాణ - ఊట్కూర్

మండలంలోని పులిమామిడి గ్రామ చెరువు కట్టపై బీటీ రహదారిని ఆనుకొని వివిధ గ్రామాలకు అనుసంధానం చేసే కేబుల్‌కు సంబంధించిన గుంత ప్రమాదకరంగా మారిందని తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రహదారిపై నిరంతరం అనేక వాహనాలు తిరుగుతుంటాయని రాత్రి సమయంలో ఈ ప్రదేశంలో వాహనాలు ఎదురెదురుగా తారస పడితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు .ప్రమాదాలు జరుగక ముందే ఇంటర్నెట్ కేబుల్ నిర్వాహకులు ఆర్ అండ్ బీ అధికారుల సమన్వయంతో గుంతను రహదారికి సమాంతరంగా పూడ్చి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు.

ఒకపక్క ఎండలు .. మరోపక్క వర్షం హెచ్చరికలు..!

- మెల్లిగా కదులుతున్న నైరుతి - రోహిణి కార్తె ప్రారంభం
- వర్షం కోసం రైతన్నల ఎదురుచూపు



గట్టు : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో రాబోయే 24 గంటల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడ మోస్తరు.. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెప్పినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎండలు దంచి కొడుతున్నాయి. ప్రతి సంవత్సరం జూన్ 20 వరకు నైరుతి మొఖం చూపకపోవడం.. అప్పటివరకు ఎండల తీవ్రత అధికంగా ఉన్న సందర్భంలో ఈ సారి నైరుతి జూన్ 10 వరకు తెలుగు రాష్ట్రాలలో ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు వాతా వరణ శాఖ ప్రకటించింది. వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. ప్రస్తుతం 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా ఏర్పడి గంటకు 17 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతున్నాయని.. రాబోయే 48 గంటల్లో బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం తీవ్ర వైకుంతంగా మారుతుందని క్రమంగా బలపడి తుఫాన్‌గా మారే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఎండల తీవ్రత ఇప్పటికీ అధికంగా ఉన్నప్పటికీ వాతావరణ శాఖ చల్లటి తీపి కబురు చెప్పింది. అయినా రోహిణి కార్తిలో ఎండలు రోకన్లు పగలగొట్టే విధంగా ఉంటాయని శాస్త్రాలు పురాణాల ప్రకారం ఈ కార్తిలో ఎండలు భగభగ మండిపోతాయని, తెలిసినప్పటికీ ఒకపక్క వాతావరణ శాఖ మాత్రం బంగాళాఖాతంలో ఏర్పడ్డ వైకుంతం బలపడి మోసరు నుంచి భారీ వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని.. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయని ప్రకటించింది. వాతావరణ శాఖ లెక్కలు పక్కన పెట్టినప్పటికీ ఎండాకాలం మరో 20 రోజుల పాటు తీవ్ర ఎండలు ఉండక తప్పదని నిపుణులు శాస్త్రవేత్తలు అంటున్నారు. గతంలో కంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే తెలుగు రాష్ట్రాలలో ప్రవేశిస్తాయని చెప్పవచ్చు. ఈ రోహిణి కార్తిలో వర్షాల ఆగమనం చెందితే రైతులు తమ తమ వ్యవసాయ పొలాలలో విత్తనాలు వేసుకునే సమయం ఆసన్నమైంది. ఈ కార్తిలో రైతులు విత్తనాలు వేయడానికి తమ తమ వ్యవసాయ పొలాలను దుక్కు దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం తక్షణమే రైతులకు రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 రూపాయలను వెంటనే చెల్లించాలని పెట్టుబడి సహాయం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. వెంటనే పంట రుణాలతో పాటు రెండు లక్షల రుణమాఫీ కూడా తక్షణమే చేయాలని కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏ క్షణంలోనైనా వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంటున్న సందర్భంగా ప్రభుత్వం అందుకు ముందు జాగ్రత్తగా యుద్ధ ప్రాతిపదికన రైతాంగ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

వాల్ పోస్టర్ల విడుదల



గట్టు : భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను ఆదివారం విడుదల చేశారు. గట్టు బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన డా. బీ. ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని మే 30, 2024 గురువారం ఆవిష్కరిస్తున్నట్లు అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కాశీం విగ్రహా విష్క ర్తగా.. విచ్చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల, పట్టణాల నుంచి ప్రజా సంఘాలు, యువతీ యు వకులు, ఉద్యోగస్తులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరెన్న, గోపాల్, ప్రభు, బ్యాంక్ మారెన్న, రామకృష్ణ, బస్వరాజ్, ఖాసీమన్న, మహేశ్, రాముడు, ప్రాన్సిస్, చిన్నన్న, వీ. ఎస్. ఆర్, ఆదాం, లాజర్ తదితరుల పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత, కేసు నమోదు

గట్టు : గట్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ ఆదేశాల మేరకు.. గట్టు పోలీస్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది పీడీఎస్ బియ్యాన్ని రాయిచూర్‌కు తరలిస్తున్న అశోక్ లే ల్యాండ్ వాహనాన్ని మాచర్ల గ్రామంలో పట్టుకొని తనిఖీ చేయగా బోయ మల్లికార్జున్, ఎరుకలి రమేష్, ఎరుకలి నర్సింహులు పీడీఎస్ బియ్యంను రాయిచూర్ కూ తరలి స్తున్నట్లు తెలిపారు. అట్టి వాహనాని తనిఖీ చేయగా అందులో 53 రైస్ బాగ్స్ దాదాపు 26 క్వింటాళ్లు ఉన్నాయి. దీంతో రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ పేర్కొన్నారు.